

# నీళ్లబాయి

జాజుల గౌరి

నిండుకుండ లెక్కున్న నీళ్లబాయిని చూస్తే గండ్లకు నీళ్లెట్లొస్తయో సిన్నప్పుడు సమజ్‌గాలే. పొద్దుగాల్ల నుంచి పొద్దిమింకేదాకా మిషినేసి సేండ్లకు నీళ్లు పారించినా మళ్లా తెల్లారేతాలకల్లా నిండుకుండ లెక్క నిండుగైతుండె.

నేను శానా బుడ్డగున్నప్పుడు మొదల్లో మా బాయి మీద మోటుంటుండె. గా మోటకు ఎడ్లను కట్టి పెద్ద బొక్కెన తోటి మా నాయినోళ్లు ఎడ్లను ముందుకు, ఎనకకు అదిలిస్తుంటే బొక్కెన బాయిలకిపోయి నీళ్లు ముంచుకుని సిల్లులు పడ్డ కుండలెక్క మీదికొచ్చి కాల్వల నీళ్లు పొయ్యంగనే గవి జరజర పారుకుంట, పారుకుంట సేండ్లకు పోతుండేగాని ఎండకాలమప్పుడు ఎంతసేపు మోట కొట్టినా సేండ్లకు నీళ్లు పారకుంటుండె. మీది మడ్లకే నీళ్లు సరిపోతుండె. కింది మడ్లకు పారాలంటే గగనమైపోతుండె.

గప్పుడు కింది సేండ్ల ఎన్కున్న సెలిమెలకెల్లి నీళ్లు 'గూడ'తోటి అమ్మ నాయిన ఏతమేస్తుంటే నేను, సెల్లె సేండ్లున్న బురదమన్ను తీస్కపోయి పక్కనున్న రాయి మీద బొమ్మలు, గురుగులు సేసి ఆరబెట్టి వస్తుంటిమి.

మల్ల దినం యిడిసి దినం నాయినోళ్లు సెలిమె కాడికి పోతుంటే ఆళ్లతోటి మేము గూడ ఒరాలపొంటి గిద్దగిద్ద ఉర్కి బండమీద మా బొమ్మలు గురుగులు మురిపెంగ సూసుకుంట ఆటితోటి ఆడుకున్నంతసేపు ఆడుకుని అవి ఇరుగంగనే మల్ల బురదమన్ను తీస్కపోయి మల్ల బొమ్మలు, గురుగులు సేస్తుంటే సమటగారే ఎండలో అమ్మ నాయిన సెలిమెలకెల్లి గూడతోటి తోడి తోడి సేండ్లకు నీళ్లు పోస్తనే వుంటుండ్రి.

అమ్మ నాయిన సేండ్లకు నీళ్లు పారాలని ఎంత జెల్దిజెల్ది యేతమేస్తుంటే బండకాడ మన్నుతోటి మా ఆటలు గంత జోర్గనే వుంటుండె.

ఆనకాల మొచ్చినప్పుడు మా సేండ్ల ఒరాల పొంటి, సేనుసుట్టు పచ్చగా నిగనిగలాడ్త పొన్నగంటి కూర, గోరిమిటి కూర నువ్వా నేనా అన్నట్లు పెర్గుతుంటుండె.

అమ్మ అప్పుడప్పుడు గా పొన్నగంటి కూరనే తెంపుకొచ్చి కూరొండితే ఎంత కమ్మగుంటుండె.

గంత కంటే కమ్మగా గోరిమిటి కూరుంటుండె. గండ్ల గింత సమురేసి, రెండు ఉల్లిగడ్డలు, గిన్ని పచ్చి మిరపకాయలు, రెండు టమాటలేసి ఒక్కతానికి సేస్తె మస్తు కమ్మగుంటుండె.

గదిగాక గోరిమిటి కూర పెయ్యికి మంచిదని అమ్మంటుండె. యింకో దిక్కు నాయిన నీసు మంచిగ తింటడని వరి కోతలైనంక ఎండ్రికాయలను పట్కరమ్మని అన్నతోటి అనంగనే సుదన్న నరేందరుగాడి తోటి కల్సి వరాల పొంటి ఎండ్రికాయలు పట్కరానికి పోతుంటే మేము గూడ వస్తమని నేను సెల్లె రడీ అయ్యే తాల్లకు అన్నకు తిక్కరేగి పెండతోటి నిండివున్న తమిలేర్లు (ఇన్పడబ్బాలు) నాకొకటి సెల్లెకొకటి ఇచ్చి సుదన్న, నరేందరుగాడు దొరల లెక్క ముందు నడుస్తుంటే పనోల్ల లెక్క మేము యెన్కెన్క పోతుంటిమి. వరిమడ్లల్లకు దిగి ఒరం పొంటున్న పొక్కలల్లకు తిరిగి తిరిగి సూస్తా ఏడైతే ఎండ్రకాయుందోనని డౌటొచ్చిందో ఇగ మమ్మల్ని ఉర్కులాడిస్తా, ''అరేయ్... అర్రేయ్... పెండాడేసి ఉర్కిపోయి నీళ్లు తీస్కరండ్రి,'' అనంగనే నేను సెల్లె సటుక్కున పెండ ఒరంగట్టు మీద పడేసి తమిలేర్లు తీసుకుని గుంతకాడికి ఉరికి నీళ్లు తీసుకొచ్చి

ఇయ్యంగనే అండ్ల ఇంత పెండేసి బిరబిర కలిపి ఒక దిక్కు నరేందరుగాడు, ఇంకో దిక్కు సుదన్న ఎంర్ర కాయలున్న పొక్కలల్ల పెండనీళ్లు పోస్తే జెరసేపటికే ఎంర్రకాయ ఊపిరాడక బయటకొచ్చేటాల్లకు నరేందర్ గాడు దాని ముందరికాళ్లను గట్టిగా పట్టుకుని ఒనరుగా వాటిని ఇరిసేస్తుండె.

పెండమోసుడు మా లెవలైతే, పెండ కలిపి పొక్కలల్ల పోసుడు సుదన్న లెవలు. అసలైన ఈరో ఆడ నరేందరుగాడే. ఎందుకంటే ఎంర్రకాయలు పట్టుడంటే మాకు వుచ్చబడినంత పనౌతుండె. ఆడొక్కడే అంత యిమ్మతుగా ఆటిని పడ్తుండె. గంద్కనే ఎంర్రకాయ లకు పోతున్నమంటె అన్నతోటి నరేందరుగాడు వుండా ల్సిందే!

ఒరం పొంటున్న పొక్కలన్ని అయిపోయేతాల్లకు సంచిల యిరవై ముప్పయి ఎంర్రికాయలైతుండె, యింగ పంచుకునుడే తరువాయి, గుంతకాడికి అందరం దబదబ ఉరికి అత్తరబుత్తర కాళ్లు సేతులు కడుగుకునంగనే సుదన్న నరేందరుగాడు దబుక్కున ఎంర్రకాయల సంచి మాకాడ నుంచి గుంజుకుని రాజులలెక్క తుమ్మసెట్టుకాడికి పోయి సగంసగం పంచుకుని సంచులల్ల యేసుకుని యింటికి పోయే టప్పుడు కూడా ఆ సంచులు ఆల్ల దగ్గిరనే, తమిలేరు డబ్బులు మా దగ్గరనే. తోవల ఏడనన్నా ఆ సంచులు ఇచ్చే సందే ఇయ్యకుంర్రి. ఎందుకంటే మేమే పట్టు కొచ్చినమని అమ్మ మమ్మల్ని ఏడ మెచ్చుకుంటదోనని, ఆ సాన్సు నేనే కొట్టాలని సుదన్న మస్తు నకరాలు సేస్తుండె.

మల్ల యింటికాడ ఆటిని సాపుసేపుడు కత అమ్మెన్క మాదే. ఎంర్రకాయల చారు పెట్టినంక మర్సటిదినం బోకెలు తోముడు పని మాదే.

గిట్లనే కొన్ని దినాలైనంక యింగ రానురాను మా బాయి దిక్కు సర్కారోల్ల కరెంటు తంబాలు రావట్టి నయి. మా సుట్టుముట్టున్న సింతబాయి, గాడిబాయి, మందబాద బాయి, సుద్దబాయిలకు కరెంటు మోటర్లు వొచ్చేతాల్లకు మా నాయినోల్లు గూడ మా బాయికీ కరెంటు మోటరు తీసుకుని పైపులు ఏసింర్రు.

గప్పటి నుంచి నాయినోళ్లు యిగ మోటగొట్టుడు బంద్. నీళ్లు తోడిపోసుడు బంద్.
కరెంటు మెషినొచ్చినంక యిగ బగ్గడిగా గీ మోట గొట్టుడేంది యిగ రాజుల్లెక్క కూకోక అనవట్టింర్రు.

ఒక్క రోజంతా మోటగొట్టినా ఒడ్వని నీళ్లని మోటరు పంపు ఒక్క గంటలనే తోడి పోసేతల్లకు మొత్తం పొలాలకి తడికాకొచ్చింది.

సంఖమెుస్తే మెుఖం కడ్గ తీరదంట. గీ మోటారుని సూసుకుని సెలిమెల యేతమేసుడు గూడ మాను కుంర్రి. మల్ల కింది పొలాలకి నీల్లెట్ల అంట తాత గుల్గుడు సురువు సేసేతాల్లకు- సేసే కర్సంతా సేసు కుంట గీ ముసలోల్ల సోది ఏడయిందునని బాయిలకెల్లి సేండ్ల కయ్యెన్ని నీళ్లు బాయిలకెల్లే తేవాలె అని బాయి యింకింత లోతుగ తవ్వాలని ఎండకాల మప్పుడు కొంతమంది కూలోళ్లను పెట్టి బాయి తవ్వుడు సుర్వు జేసింర్రు.

కొన్ని దినాల నుంచి మూలకు పడ్డట్టున్న మోట బొక్కెనకు మల్లా పనొచ్చింది.

ఒక దిక్కు మెషినేసి నీళ్లన్నీ తీసిపోస్తుంటే బాయి లకి దిగిన పనోళ్లు బాయిల నుంచి వొచ్చిన ఒంర్రు మన్నునంత బొక్కెనతోటి తీస్తుంటే మోటకొడ్తున్న నాయిన తాత బాయిగడ్డ మీద ఆ మన్నేసేతాల్లకు అమ్మోల్లు తట్టలల్ల దాన్ని ఎత్కపోయి పొలాలల్ల ఏసివొ స్తుంటే బాయిని యింకింత ఎడల్పుగా, యింకింత లోతుగా, తవ్వుతుండగా ఒంర్రంతా పోయి మొరం మన్ను రావట్టింది.

ఆడికెల్లి గూడ యింక ఇరవైగజాల లోతు తవ్వాలని నాయిన సెప్తుంటే పని యింకింత జోర్గ సురువై జోరందుకుంటే పోరగాళ్లమందరం బాయి సుట్టు నిలవడి లోపలికి తొంగి సూడవట్టినం.

"ఓ పోరగాండ్లు ఏం సూస్తుంర్రురా ఇండ్లకు పొంర్రి కాలుజారి బాయిల పడ్డరంటె గా తంటెవడు పెట్టుకోవాలి," అని తాతన్నా ఒక్కరం ఒన్కలే జన్కలే.

మా పోరగాండ్లందరికి బాయిలకి నీళ్లెట్లస్తయో తెల్సుకోవాలని మస్తు ఆత్రంగున్నది యింగ ముసలోడి మాటెట్లింటం.

గప్పటికి, "గీ బాయిల నీళ్లను ఆనదేవుడొచ్చి రాత్రిపూట పోసి పోతడంట," అని శామ్‌రావ్ అన్న అంటుండె.

"ఆ సాలు తియ్యి, మోటరేస్తనే గంత జోర్గ సప్పుడైత నీళ్లొస్తయి, మరి ఆనదేవుడు ఒక్కసారే గిన్ని నీళ్లను మన బాయిల గుమ్మరిస్తే రాత్రిపూట సీమ సిట్టుక్కుమన్నంత సప్పుడన్నా కావాలి గదా," అంట యాదిగిరన్న తిర్కాసు పెట్టేతాల్లకు -

"ఔ గది నిజమే మల్ల సప్పుడు రావాలెగా," అన్నడు అన్నతో జత గలుస్తు.

ఆరం దినాల నుంచి కూలోళ్లు బాయి తవ్వుతనే వుంర్రు. నాయినోళ్లు మన్ను ఎత్తి పోస్తనే వుంర్రు. మేము బాయిల నీళ్లెట్లస్తయోనని గడ్డమీదికెల్లి తొంగి సూస్తనే ఉన్నం, తాత పెట్టే సోది పెడ్తనే వుండు.

దినదినానికి బాయిలకి నీళ్లు ఎక్వ రావట్టినయి. సీకటి పడేటాల్లకు ఒట్టిపోయినట్లున్న బాయి తెల్లారే తాలకల్లా సగం కల్లా నిండుకొచ్చి నీళ్లన్ని చాయినీళ్ల లెక్కుంటుండె. పనోళ్లు పన్లకు వొచ్చేతాల్లకి నాయిన మెసినేసి నీళ్లన్ని పొలంలకి ఇడ్సివెడ్తుండె.

ఆరం దినాలు పూరగ అయ్యేతాల్లకు బాయి తవ్వుడు పూర కావచ్చింది. నాయినోళ్లు మెషినేసి ఎంత దూరందాకా పొలంలకి నీళ్లు పారుతున్నయని రోజూ సూస్తెనే వుండ్రు. రోజురోజుకీ మీద మడికెల్లి కింది మడ్ల దాకా నీళ్లు పారేతల్లకు మాకందరికి మస్తు కుషిగైంది.

బాయి తవ్విన లాస్టు దినం నాయినను పిల్సి, "నీయవ్వ పోరగాండ్లకీ బాయిల నీళ్లెట్లస్తయా సూడా లని మస్తు పరేషాన్ గుందిరా మల్లయ్య ఈల్లను బాయి లకు దింపి గది సూపియ్యరా," అని తాతంటుంటె,

నాయిన మా సేతులు పట్టుకొని మా దిగుడు బాయిలకి తీస్కపోయి దరి కాడికెల్లి మమ్మల్ని లోపలికి దింపంగనే, నెత్తి ఎత్తి మీదికి సూసిన నాకు కండ్లు గిర్రున తిర్గినట్లయి నాయినను గట్టిగా పట్టుకున్నా.

లోపల మన్ను తవ్వేటోళ్లు తవ్వుతునే వుండ్రు. ఇంకొకపక్క బాయిగడ్డ మీద మోటరునీళ్లను తోడిపోస్తనే వుంది.

బాయిల సుట్టుపక్కల సొరికెలకేని నీళ్లు దార గొస్తుంటేగవి ఎట్లొస్తున్నయో సమజ్గాక ఎర్రిసూపులు సూస్తా అటు ఇటు సూస్తుంటే నాయిన మమ్మల్ని ఆడ్కి తోల్కపోయి,

"యింగో బిడ్డా గీ ఊటలల్లకెల్లే మన బాయిలకి నీళ్లొస్తయి. ఇంగో గిది సుద్దబాయి ఊట, గిది గాడి బాయి ఊట, గిది సింతబాయి ఊట మల్లగిదేమో తోట బాయి ఊట," అని సూపేతాల్లకు ఇంకోదగ్గర భూమిల నుంచే 'బుడుంగ్ బుడుంగ్'న నీళ్లస్తుంటే మల్ల 'గిదేడి కెల్లి వస్తుందే,' అని సెల్లె అడిగేతాల్లకు, నాయిన కిందికి వంగి ఆ ఊట మీద రెండు సేతులుపెట్టి కండ్లకద్దుకుని మొక్కుతా, "ఇది భూతల్లి ఊట బిడ్డా ఆ తల్లే మనకు కావాల్సిన నీళ్లు ఇస్తది, ఆమెనే అన్ని దిక్కులకెల్లి కావ లసిన నీళ్లు తెస్తది," అని అంటుంటే నాయిన కండ్లు జిగేల్న మెర్సినయి. యింగ పోరగాండ్లమందరం ఊటల కాడికి ఉరికి ఆ నీళ్లను దోసిళ్లలో తీసుకుని తాగితే మస్తు తియ్యగున్నయ్.

బాయిల సుట్టూరంగ వున్న సొరికెలను, దరు లను సూస్తుంటే యిసిత్రంగ అన్పియ్యబట్టింది.

అమ్మో! మా బాయి ఎంత లోతైంది. ఒకేళ ఒకళ్ల మీద ఒకళ్లు నిలపడ్తే దగ్గర దగ్గర ఇరవైమంది దాకా కావాలేమో మోటందుకోడానికి అన్కుంట నోరెళ్లబెట్టి కండ్లను పొద్దుతిరుగుడు పువ్వులెక్క సేసి సూస్తుంటే బాయిలకి వొంగి వున్న సింతసెట్టు కొమ్మలకున్న గూడ్లల్లకెల్లి పిచ్చుకపిల్లలు కిసికిసమన్నయి.

మా బాయి తవ్విన కాడ్నించి అన్ని పొలాలకు నీళ్లు అంది పంటలు యింకింత మంచిగ పండవట్టి నయి. నాయినోళ్లు టయిము సిక్కి బయట ఉప్పరి పన్లకు గూడా పోయి, అప్పటిదాకా పొలం దిక్కెల్లి బాయి తవ్వుడు దిక్కెల్లి సేసిన అప్పులు గూడ తీర్స వట్టిండ్రు.

గట్లనే గట్లనే మేం పెద్దగైతుండంగనే మమ్మల్ని యిస్కులల్ల ఏసిండ్రు.

గప్పటిదాకా నాయినోళ్లు బాయిల ఈత కొడ్తుంటే తువ్వాలు అండరువేరు బనీను పట్టుకుని నాయిన ఈతకొట్టడం మురిపెంగా సూసిన మేము, అన్నోళ్లు ఈత నేర్సేతాల్లకు మాకు ఈతకొట్టాలన్పిస్తుండెగానీ గప్పటి దాకా మా బాయిల ఆడిపోరలు ఎవళ్లు ఈత కొట్టలే.

ఐనా నాకు సెల్లెకు బాయిల దూకి ఈత కొట్టా లని మనస్సుల మస్తు పీకుతనే వుంటుండె.

శనారము, ఐతారము వచ్చిందంటే శనారము సగంపూట నుంచి, ఐతారము మొత్తమే మొగపోర గాండ్లతోటి గల్సి నేను సెల్లె బాయిలకి ఎక్కుడు దిగుడు సేసుకుంట దరికాడ కూకుని కాళ్లు నీళ్లల్లకు సాపి తప్పడ తప్పడ కొట్టుకుంట మొఖం కాళ్లుసేతులు కడు క్కుంట, నోట్ల నీళ్లు పోసుకుని పుక్కిళించుకుంట సెట్టు మీదకెల్లి రాలిన సారపల్కులు తిన్కుంట, నీళ్లు తాగు కుంట నీళ్లల్ల ఆడుకుంటుంటే ఈతొచ్చిన పోరగాండ్లు ఈత కొట్టుకుంట చోర్ ఆట ఆడుతుంటే మేము గూడ గట్లెప్పుడు ఆడ్తమోగదా అని నేను సెల్లెలు అన్కుంటుం టిమి.

ఎండకాలమొచ్చిందంటే సాలు పోరగాండ్ల మందరం బాయిగడ్డ మీదనే జమైతుంటిమి.

ఎట్లయినా ఈత నేర్సి ఆటలాడాలని నేను సెల్లె పోరగాండ్ల తోటి గల్సి బాయిలకు దిగి పొలాలకు నీళ్లు ఎప్పుడు పెడ్తరా అని ఎదురుసూసి బాయిల నీళ్లు తక్వ కాంగనే, ఆ దరికెల్లి ఈ దరికి, ఈ దరికెల్లి ఆ దరికి చాపలలెక్క దూకుకుంట మొగపోరగాండ్లతోటి ఈత నేర్సుతుంటే ఒక్కొక్కసారి ఇస్పీడు సరిగలేక చేతికి దరి అందక నీళ్లల్లకు మునిగిపోతుంటే గుండెలు లటుక్కుమంటుంటే నీళ్లు మింగకుంట కిందికి మీదికి మునకలేస్తుంటే ఎవలో ఒకళ్లు చెయ్యిచ్చి దబుక్కున దరిమీదికి గుంజుతుండె. గప్పటికే నీళ్లు ముక్కులకి

పోయి నషా కపాలంలోకి ఎక్కి అతలాకుతలమై దరి మీద కూకుని ఆయాసపడ్తుంటే పోరగాండ్లందరు పక్కపక్క నవ్వుతున్నా ఎట్లయినా ఈత నేర్వాలన్న కొర్కె మాలో సావలే.

కొన్ని దినాలకు ఎట్లయితేంది ఈత నేర్సుకున్నం. ఇంగ మాకు పట్టపగ్గాలు లేవు.

మొగపోరగాండ్లతోటి గల్సి పదిగంటలకు బాయిలకు దిగి ఈత కొట్టుకుంట చోర్ ఆట ఆడుకుంట బాయిలకెల్లి దరిమీదికీ, దరిమీది కెల్లి బాయిగడ్డ మీదికి ఆడికెల్లి మోటమీదికి, యింకా సింతసెట్టు మీదికి ఎక్కి దుంకుడు సుర్వు సేసినం.

ఒక్కొక్కసారి నిలవడ్డోళ్లం నిలవడ్డట్లు మోటమీది కెల్లి బాయిలకి దుంకేతాల్లకు బాయిల అడుగుల వున్న బురద మన్ను మెత్తగా కాళ్లకు తాకుతుంటే గంత లోతుకొచ్చినమా అని అన్పియ్యంగనే గుండె ఆగినంత పనై ఆత్రగా ఒక్క ఊపునే చాపలలెక్క మీదికి తేలి చోర్ అయినోనికి దొర్కకుండ నేను, గంగాలు, వరాలు, నర్సిగాడు, నరేందరు, ఎంకటేశు, జైయిందు, రమేషు అటొక్కలం ఇటొక్కలం బరిబత్తలనే ఒకలం పట్టక ఒకలం అటు ఇటు ఈదుకుంట ఉరుక్కుంట దుంకుకుంట బాయినంతా కుల్లు కుల్లు సేస్తా రెండు మూడుగంటల చోర్ ఆట ఆడేతాల్లకు బాయి నీళ్లన్ని చాయి నీళ్లయితుండె.

నడ్మ నడ్మ బిందె పట్టుకుని బాయినీళ్లకొచ్చిన అంజొదిన శాంతొదిన మమ్మల్ని బరిబత్తల సూసి, "గీ ఆడిపోరలకు గింతనన్నా సెరం లేదమ్మ. మగపోరగాండ్ల తోటి గల్సి ఎట్ల ఈతకొడ్తుండ్రో సూడు," అంట ఈసడిస్తా బాయిలకి దిగి నీళ్లు ముంచుకుంటుంటే, మా ఈపులకి సెప్పుండ్రి అన్కుంట ఆళ్ల ముందుకు ఈదుకుంట వొచ్చి రెండు సేతుల తోటి తప్పడ తప్పడ నీళ్లను కొట్టే తాల్లకు ఆల్ల మీద నీళ్లు రయ్యిన సిత్తుతుంటే, "ఏం సిగ్గులేని పోరలు," అంట ఉడుకుకుంట పోయి మా యవ్వారం మా అమ్మకు సెప్పేతాలకు ఇల్లు, గడ్డాము ఊకుతున్న అమ్మ సేతుల సీపురుకట్టతోనే బాయిగడ్డ మీదికొచ్చి బాయిలకి తొంగిసూస్తా, "ఓ గౌరాలు, ఓ గంగాలు, ఇంకా ఈతకొట్టుడు కాలే బిడ్డా, సెల్లెను తీసుకుని జెల్ది గడ్డెక్కుండ్రిరా," అంటనే మా యింటికి పోయే తోవ దిక్కు సూస్తా, "ఈళ్ల మీద మన్నువడ నా పిల్లలు బాయిల ఈతకొడ్తే ఈళ్ల మిండడి సొమ్మేం పోయె. ఆళ్ల పిల్లలు గూడా బాయిల వుండ్రు," అంట సీపురుకట్టకున్న సెత్తను ఇంకింత జోర్గ దులుపుకుంట,

"జెల్ది రండ్రి బిడ్డా మిమ్మల్ని సూస్తె కండ్లల్ల వెట్టు కుంటుండ్రు," అంట మల్లొకసారి బాయిలకు అమ్మ తొంగి సూస్తుంటే,

"అమ్మ యింకొక డై ఆడొస్తమే నువ్వు పో, నువ్వు పో," అంట అమ్మ ముందరనే నీళ్లల్ల బుడుంగు బుడుంగున మున్గుతుంటే అమ్మ కుషీకుషీగా మమ్మల్ని సూస్తా సూస్తానే యింటికి మర్లుతుండె.

గట్లనే గట్లనే, 'ఒక్క డై ఒక్క డై,' అని అన్కుం టనే రెండు మూడు డైలాడుకుంట ఆడుకుంట అలిసి పోయి బాయి గడ్డెక్కెతాల్లకు కండ్లన్ని ఎర్రగై నెత్తంతా దువ్విట్లయి, ముఖాలు పీక్కుపోయి, పెయ్యంతా పేలి పోయి ఒట్టిచాపల లెక్కయి ఒనుక్కుంట ఒనుక్కుంట గడ్డెక్కి బట్టలేసుకుంటుంటిమి.

గప్పటికి కూడా యింటికి పోబుద్ధిగాక ఒకలెనక ఒకలం సింతసెట్టెక్కి సింతకాయలు తెంపుకుని తింటుంటిమి. సీమ సింతకాయల సెట్టెక్కి బొంగుల తోటి సీమసింతకాయలు తెంపుకుని పొద్దిమింకేటాల్లకు యింటికి పోతుంటిమి.

ఒక యాడాది గిట్లనే ఎండకాలమప్పుడు బట్టలు బాయిగడ్డ మీద యిడ్సి బాయిల చోరాట ఆడుకుంటు న్నం. ఆయల్ల బాయిల నీళ్లు కొన్నే వున్నయి మోట మీద్కెల్లి దుంకుతే బొక్కలిరుగుతయి అన్జెప్పి ఎవలం బాయిగడ్డ ఎక్కి దూకుతలేం. అందరం లోపలనే ఆ దరి మీదికి ఈ దరిమీదికి ఉర్కుతనే చోర్ ఆట ఆడ్తున్నం. ఆట మస్తు వుషారులో వుండంగనే, బాయి గడ్డ మీదికెల్లి కెక్కడ కెక్కడమని నవ్వులు ఇన్పించి సటుక్కున ముగ్గురు అక్కసెల్లెండ్లం బాయిలకి దూకి ఈదుకుంటనే మీదికి సూసేతాల్లకు అక్కడ అంజొదినె, శాంతొదినె, బాలనర్సక్క, విజ్జక్క, సత్యనారాయణ బావ నిలబడి మమ్మల్నే సూస్తా పగలబడి నవ్వుతుంటే, బావ సేతుల మా బట్టలున్నయి. గది సూడంగనే గుండెలు గుటుక్కుమన్నయ్. సిగ్గుతోటి సగం సచ్చినం.

ఎందుకంటే బాలనర్సక్కకీ, సత్యనారాయణ బావకీ పెండ్లయి గప్పటికింకా నెలగూడ కాలె. కొత్త బావ ముందల బరిబత్తెల ఉండేసరికి కండ్లు సిగ్గుతో సితికినయి. గుండెల సప్పుడు సెవిలకినవట్టిందిగానీ సూపులు నీళ్లమీద నిల్పి దరికాడికొచ్చి మెడలోతు నీళ్లల్ల నిలవడ్డ మమ్మల్ని సూసుకుంట ఆల్లు నవ్వుతుండగనే పోరగాండ్లందరు తలా ఒక దిక్కు గడ్డెక్కి ఉర్కిపోతుంటే మేము ఆడనే సిక్కుడు సూసి, గడ్డమీదున్నోళ్లంతా విరగబడి నవ్వుతుంటే సత్యనారాయణ బావ మోకాళ్ల మీద కూకుంట, "దా గౌరాలు, దా గంగాలు మీ సెల్లెను

తీసుకుని గీడికి రండ్రి మీ బట్టలిస్తా,'' అంటుంటే ఒదినోళ్లు నవ్వుడు నవ్వుడేగాదు గా తీర్గ నవ్వవట్టిండ్రు.

మాకైతే బావ మీద కోపం, వదినల మీదికి పోయి అసలు గీల్లే ఓర్వక గీ పని సేయించిండ్రని ఒక దిక్కు వుక్రోషం ముంచుకొస్తుంటే,

''మీ మరదండ్లు సెప్తె వినరు మొగపోరలతోటి బరిబత్తెల ఈత కొట్టద్దంటే గట్లనే కొడ్తరు తమ్మీ. నువ్వు మొగపోరగాడివేగా నీతో ఈత కొడ్తరేమో అడ్గు,'' అంట ఒదినలిద్దరూ తలా ఒక దిక్కు ఎగేస్తుంటే, యింక సూస్కో మా కడ్పుల మంట తలా ఒక దిక్కు ముగ్గురం కల్సి ఎన్ని గలీజు మాటలు తిట్టాలో అన్ని గలీజు మాటలు ఒదినలని తిట్టినంగానీ అవి మా పెదవిని దాటి రాలే. బావా, వదినల ఎకసెక్యాలు మానలే.

మాతోటి అప్పటిదాకా ఈతకొట్టిన పోరగాండ్లు పోయి అమ్మకు గీ సుద్ది సెప్పేతాల్లకు, ''ఆడిపిల్లలను పట్టుకుని గట్ల సేస్తుండ్రేందే,'' అంట అమ్మ రయ్యి రయ్యి బాయికాడి కొస్తుంటే, బట్టలను బాయిగడ్డ మీదనే ఇడ్సి ముసిముసిగా నవ్వుకుంట అందరూ తలా ఒక దిక్కు జారుకుంటుంటే సుద్దేందో సమజయి కామోషిగా బట్టలు తీసుకొని మమ్మల్ని యింటికి తోల్కొచ్చి పచ్చిబరిగె తీసుకుని మా ముగ్గురి వీపుల మీద పట్టపట్ట అంటిస్త, ''శరం లేదే బద్మాషీలు. మొగ పోరల్లతోటి బరిబత్తెల ఈత కొట్టొద్దంటే యింటరానే! మీరు ఏడెనిమిదేండ్లొస్తున్నా యింకా సిగ్గురాలే,'' అంట పురానం సుర్వుజేస్తుంటే బావ మీద వదినల మీద మస్తు కోపమొచ్చిందిగానీ బాలనర్సక్కనీ, విజ్జక్కని ఏమనుకోలే. ఎందుకంటే మేంగూడ గట్ల పెద్దగై గట్ల ఎప్పుడుంటమొ అని ఎదురు సూసుడేనాయె.

అమ్మకు కోపం పోయినంక మల్లా మమ్మల్ని సమజాయించింది. ''బిడ్డా గట్ల మీరు ఆళ్లతోటి ఆడ్తిరి. అందరు మిమ్మల్ని ఏడిపిస్తుంటే నాకు మస్తు కోప మొచ్చె. నా కంటికి మీరు పిల్లల తల్లులైనా సిన్నోళ్లే బిడ్డా. గానీ గీ దునియకి గాదు,'' అంట దగ్గిరకు తీసుకుంది.

ఇగ గాయల్ల నుంచి మొగపోరలతోటి ఈత కొట్టుడు మాని ఎవలు లేనప్పుడు లంగజాకెట్టు మీదనే బాయిలకు దుంకుడు మల్ల సుర్వు జేసినంగానీ ఈత మానలే.

నేనైతే నా ఇష్టమొచ్చినప్పుడల్లా పగటిపూటపోయి ఒక్కదాన్నే బాయిలకి దూకి ఈత కొడ్తుంటి.

గప్పుడెవలన్నా సూసి, ''ఓమ్మో గింత లోతు బాయిల గీ పిల్ల యింత గూడ భయంలేక ఈత గొడ్తదేంది,'' అంట నాకు ఇనపడేలా సోది ఇన్పించినా నేను కెరలసెయ్యకపోదు. ఎందుకంటే, అమ్మ సెప్పిన కండీషన్లనే నేను ఈత కొడ్తున్న నాకెర్కె.

ఒక్కొక్కసారి బాయిల నీళ్ల మీద ఎల్లకిల్ల పడు కొని అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు ఈదు తుంటే గడ్డ మీదున్న చింతసెట్టు తన సేతులు సాచి 'రా బిడ్డా' అని పిలుస్తున్నట్లనిపిస్తుంటే, ఆకాసంల సూర్యుడు నాకు చలి కాస్తున్నట్లు, సారసెట్టు లేత కొమ్మలు నాతో దోస్తి సేస్తున్నట్లు సుట్టు వున్న బాయి తల్లి, అమ్మలా నన్ను తన వడిల లాలపోస్తున్నట్లు నిద్రపుచ్చి జోలపాడ్తున్నట్లు అన్పిస్తుంటే బాయి తవ్విన నాడు, 'గీ భూతల్లే మనకు అన్ని ఇస్తది బిడ్డా,' అంట నాయిన అన్న మాటలే నా సెవిల గింగుర్లు తిర్గుతుం టుండె.

ఒక్క రోజన్నా బాయిని సూడకుంటే నా మనస్సు ఎట్లనో వుంటుండె. ఇంగ నేను పెద్దగైతున్న కొద్దీ మా సుట్టుముట్టు బాయిలన్నీ సుసైటీలకి అమ్ముడుపో వట్టినయి. మా నాయినోళ్లు గూడ మా పంటపొలాలతో గూడ మా బాయిని అమ్ముడుకు పెట్టిండ్రు.

పచ్చని సేండ్లు ప్లాట్లుగా మారి అండ్ల బంగళాలు లేసినయి. బాయినీళ్లు నిల్వ వుండే దినమొచ్చింది. బాయిని గూడ గూడిపి ప్లాట్లు సెయ్యాలని సొసై టోళ్లు అండ్ల రాళ్లురప్పలు మురికి సెత్త తెచ్చి పోస్తుంటే మనస్సు అల్లకల్లోలం అయింది.

తేనె లెక్క తియ్యగున్న నీళ్లన్ని మురికి సెత్తల మురఁగి మురఁగి నల్లగయినయి.

అయినా నా మనస్సు అమ్మ సుట్టు పసిపిల్లలెక్క కోడిసుట్టు కోడిపిల్లలెక్క తిర్గుతుంటే నా అమ్మ నేను సూసినప్పుడల్లా సేతులు సాచి, 'రా బిడ్డా,' అంట నన్ను పిలుస్తున్నట్లనే ఉంది.

నా కండ్ల ముందే నా బాయి తల్లికి గోరి కడ్తుంటే నా మనస్సు సెరువైంది.

మురిగి మురిగి కాల్వ అయి, సెత్తకుండి అయినా మూగదానిలెక్క కాలంల కల్సిపోయినా అమ్మంటే నాకెప్పటికీ ప్రాణమే. రేపోమాపో ఆడనే కంకరరాళ్లతోటి పిల్లర్లు ఏసి ఆకాసాన్ని అంటే బిల్డిం గులు కడ్తారేమో.

అయినా ఈ భూదేవంత పచ్చగా, ఆమె ప్రేమంత చల్లంగా నా బాయితల్లి యాది నే సచ్చేదాకా నాతోటే వుంటది.

*విపుల, డిసెంబర్ 2004*